'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# అన్నదాతల బతుకు ఆగమాయె

తెలంగాణలో దసరా తర్వాత సంక్రాంతి అతిపెద్ద పండుగ. ఎవుసంపై ఆధారపడే రైతన్నలకు ఈ పండుగ ఎంతో ప్రత్యేకం. సమైక్య పాలనలో 60 ఏండ్ల పాటు కరువుతో సావాసం చేస్తూ ఆకలితో అలమటించిన మన అన్నదాతలు.. గడిచిన తొమ్మిన్నరేండ్లు కేసీఆర్ హయాంలో స్వర్ణయుగాన్ని చూశారు. స్వరాష్ట్రంలో ఉద్యమనేత సంకల్పంతో బీడు భూముల్లోనూ రతనాలు పండాయి.

24 గంటల ఉచిత విద్యుత్తు, పుష్కలంగా సాగునీరు అందడంతో సంక్రాంతిని సంబురంగా జరుపుకొన్నారు. కానీ, ఈ సంక్రాంతికి మాత్రం రైతుల ఇండ్లల్లో సంబురం కనిపిస్తలేదు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తర్వాత కేసీఆర్ సర్కార్ లేకుండా జరుగుతున్న మొదటి పండుగ ఇది. కేసీఆర్ సర్కార్‌తో పాటే రైతుల జీవితాల్లో సంబురాలు మాయమయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సాగునీరు లేక, రైతుబంధు అందక కర్షకులు కష్టాలు పడుతున్నారు. 'బాపు' లెక్కన రైతులకు పెద్దదిక్కు కేసీఆర్ అండను కోల్పోయిన రైతులు దిగాలుగా ఉన్నారు.



**చిటుకుల మైసారెడ్డి**
94905 24724



తొమ్మిదిన్నరేండ్ల కేసీఆర్ పాలనలో సంక్రాంతి పండుగ సంబురంగా ఉండేది. సంక్రాంతి శోభకు మన తెలంగాణ పెద్ద బాపు కేసీఆర్ అందించే 'రైతు బంధు' పండుగ సంబురాలు అంగరంగ వైభవంగా జరిగేవి. పల్లెలన్నీ పండుగ వాతావరణంలో కోలాహలంగా కనిపించేవి. దేశంలో రైతులకు పెట్టుబడి సాయం అందించే పథకాన్ని తీసుకొచ్చిన మొదటి రాష్ట్రం తెలంగాణ. కాళేశ్వరం ద్వారా తెలంగాణ కోటి ఎకరాల మాగాణిగా మారింది. తద్వారా పచ్చని సిరుల పంటలు పండుతున్నాయి.

అరువై ఏండ్ల ఉమ్మడి రాష్ట్ర పాలనలో రైతు బతుకు ఎట్లుండే. తొమ్మిదిన్నరేండ్ల కేసీఆర్ పాలనలో రైతులు ఎంత సంతోషంగా ఉన్నారు. గత తొమ్మిదిన్నరేండ్ల పాటు రైతు బంధు పండుగతో సంక్రాంతి సంబురం అంబరాన్ని అంటేది.

తెలంగాణ బిడ్డల బాగు కోసం ఆనాడు సీఎం కేసీఆర్ ఒక తండ్రిలాగ భవిష్యత్తుకు భరోసా ఇచ్చారు. రాష్ట్రం తెచ్చిన ఉద్యమ నాయకుడే పరిపాలకుడిగా, బాపులా రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమంలో ప్రగతి పథంలో ముందుకు నడిపించారు. కేసీఆర్ బాపు నాయకత్వంలో తెలంగాణ ఎవుసం పండుగలా ఉండేది. ఆయన రైతన్నకు వెన్నెముకగా నిలిచారు.

నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు పూర్తయ్యాయి. అయినప్పటికీ రైతుబంధు నగదు అందించలేదు. తూతూమంత్రంగా 30 శాతంలోపు రైతుల ఖాతాల్లో డబ్బులు వేశారు. ఇంకా 70 శాతం మంది రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్నారు. అయినప్పటికీ అప్పోసొప్పో చేసి ఇప్పటికే కొంతమంది రైతులు బోరు బావుల కింద వరినాట్లు వేశారు. సాగునీరు లేక, పెట్టుబడి సాయం అందక.. గతంలో కంటే ఈ యాసంగిలో వరి సాగు విస్తీర్ణం భారీగా తగ్గింది.

బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు పంట సీజన్‌లో సమయానికి టింగ్ టింగ్ మని ఖాతాల్లో నగదు జమ అవుతుండె. 11 విడతల్లో కేసీఆర్ సర్కార్ క్రమం తప్పకుండా రైతుబంధు నిధులను విడుదల చేసి రైతన్నలను ఆదుకున్నది. గత వానకాలం సీజన్ నాటికి రూ.72 వేల కోట్లను రైతుబంధు పేరిట రైతులకు అందించింది. గతేడాది జూన్‌లో వానకాలానికి సంబంధించి పంట పెట్టుబడి సాయం కింద 65 లక్షల మంది రైతులకు రూ.7,508 కోట్లను అందించి రైతు సంక్షేమంలో తనకు తానే సాటి అని నిరూపించుకున్నది. ఈ విధంగా రైతుబంధు విషయంలో కేసీఆర్ సర్కార్ రైతులను ఎన్నడూ ఇబ్బంది పెట్టలేదు. సమయానికి నగదు అందించి ఆదుకున్నది.

యాసంగి సీజన్‌కు సంబంధించి నవంబర్‌లో విడుదల కావాల్సిన 12 విడత రైతుబంధు నిధులు కాంగ్రెస్ నిర్వాకం వల్ల ఆగిపోయాయి. ఎన్నికల కోడ్ పేరిట ఆ పార్టీ ఫిర్యాదుల కారణంగానే రైతుబంధుకు ఆటంకం ఏర్పడింది. తాము అధికారంలోకి రాగానే రైతుభరోసా పేరిట అంతకుమించి పెట్టుబడి సాయం ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ చివరికి చేతులెత్తేసింది. అధికారం చేపట్టి 40 రోజులైనా ఇప్పటికీ పెట్టుబడి సాయం అందించలేదు. 'అంతకుమించి' సంగతి దేవుడెరుగు.. కనీసం గతంలో కేసీఆర్ సర్కార్ అందించిన విధంగా ఎకరానికి సీజన్‌కు ఐదువేలు అయినా ఇచ్చే దిక్కులేదు. రైతు బంధు నగదును సమయానికి ఇవ్వకుండా దాదాపు 70 లక్షల మంది రైతుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతున్నది. పండుగపూట పస్తులు ఉంచుతున్నది.

**యాసంగి సీజన్‌కు సంబంధించి నవంబర్‌లో విడుదల కావాల్సిన 12 విడత రైతుబంధు నిధులు కాంగ్రెస్ నిర్వాకం వల్ల ఆగిపోయాయి. ఎన్నికల కోడ్ పేరిట ఆ పార్టీ ఫిర్యాదుల కారణంగానే రైతుబంధుకు ఆటంకం ఏర్పడింది. తాము అధికారంలోకి రాగానే రైతుభరోసా పేరిట అంతకుమించి పెట్టుబడి సాయం ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ చివరికి చేతులెత్తేసింది. అధికారం చేపట్టి 40 రోజులైనా ఇప్పటికీ పెట్టుబడి సాయం అందించలేదు.**

రైతు సంక్షేమం పట్ల కేసీఆర్‌కు ఉన్న అంకితభావం మరెవ్వరికీ ఉండదు. కేంద్ర ప్రభుత్వం అనేక విధాలుగా, ఆర్థిక పరంగా ఇబ్బందులు పెట్టినా కేసీఆర్ అన్నదాతలకు ఏ ఇబ్బందీ రానివ్వలేదు. కష్టం అనే మాట రైతుల దరి చేరకుండా తొమ్మిదిన్నరేండ్ల పాటు కంటికి రెప్పలా కాచుకున్నారు. రైతుల పక్షాన నిలబడ్డారు. ఎవుసం పండుగలా, రైతు సంతోషంగా ఉండేందుకు అన్నదాతకు గత కేసీఆర్ ప్రభుత్వం అందించిన వరం రైతుబంధు. దీంతో పాటు రైతుకు ధీమాగా కేసీఆర్ ప్రభుత్వం రైతు బీమా తీసుకొచ్చింది. దీని ద్వారా 83,216 మంది రైతు కుటుంబాలకు రూ.4,161 కోట్ల పరిహారం అందించారు.

కేసీఆర్ ముందుచూపు వల్లనే రాష్ట్రంలో పంటల దిగుబడి కూడా గణనీయంగా పెరిగింది. తెలంగాణ సీఎంగా ఆయన పని తీరుకు పెరిగిన సాగు విస్తీర్ణం, పంట దిగుబడి నిదర్శనం. ఇదే కేసీఆర్ దార్శనికతకు అద్దం పడుతున్నది. రూ.28,473 కోట్లతో విద్యుత్తు రంగంలో మౌలిక సదుపాయాలు కల్పించారు.

సాగుకు 24 గంటల ఉచిత విద్యుత్తు అందించిన ఘనత మన కేసీఆర్‌ది. నిరంతర వెలుగుల కారణంగా మన తెలంగాణ ఆకుపచ్చ తెలంగాణగా విలసిల్లింది. గు నీటి ప్రాజెక్టులు పూర్తి చేసి నీళ్లు అందించారు. కాళేశ్వరం ద్వారా రిజర్వాయర్లు, చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లు నీటితో కళకళలాడుతున్నాయి. ఈ నీళ్లను యాసంగి పంటలకు అందిస్తే కనీసం నాలుగైదు లక్షల ఎకరాలు పారుతుంది. కానీ, ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోలేదు. అటు కృష్ణా బేసిన్ కింద క్రాప్ హాలిడే ప్రకటించారు.

ఈ దేశంలో మన కేసీఆర్ ఒక్కరే రైతుల కోసం, ప్రజల కోసం ఆలోచించే నాయకుడు. దేశానికి దిక్సూచి. ఆయన రైతు బిడ్డ, ఎవుసం అంటే ఆయనకు ప్రాణం. రైతు అంటే ప్రేమ. ఎవుసం కోసం, రైతు కోసం అహర్నిశలు శ్రమించే వ్యక్తి కేసీఆర్. రైతు బాగు కోసం నిత్యం తపించే తత్వం ఆయనది. రైతు కోసం ఎంతకైనా కొట్లాడుతారు. ఎవరితోనైనా ఢీ కొట్టడానికి సిద్ధమవుతారు. రైతు కంట కన్నీళ్లు చూస్తే చలించే మనసు ఆయనది.

ఈ సంక్రాంతి పండుగ సమయంలో రైతులు దిగాలుగా ఉన్నారు. సంక్రాంతి అంటేనే రైతుల పండుగ. గత తొమ్మిదిన్నరేండ్ల పాటు కేసీఆర్ పాలనలో తెలంగాణలో పండుగ వాతావరణం కోలాహలంగా ఉండేది. కానీ, ఈ సంక్రాంతి పండుగ వెలవెలబోతున్నది. ఎవుసం పండుగలా, రైతు సంతోషంగా ఉన్నప్పుడే రాజ్యం పచ్చగా ఉంటుంది. ఏ ప్రభుత్వం అయినా రైతులకు అండగా నిలవాలి. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు భరోసా ఇచ్చి, సాగుకు సాయం చేయాలి.

*జై రైతన్న.. జై తెలంగాణ..*



# అసలైన నాయకుడు కేటీఆర్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కావాలంటే ఎన్నయినా చెప్పుకోవచ్చు. కానీ, ఆయన అలా చేయలేదు. విజయం దక్కినప్పుడు ఆ క్రెడిట్ అందరికీ చెందుతుందని చెప్పే ఆయన.. పార్టీకి ఎదురైన ప్రతికూల పరిస్థితికి మాత్రం తనదే పూర్తి బాధ్యత అని ధైర్యంగా చెప్పుకొన్నారు. తద్వారా నిజమైన నాయకుడనిపించుకున్నారు.



**పాటిమీది జగన్**

ఐటీ శాఖ మంత్రిగా ఉన్నప్పుడే ప్రపంచంలోనే అతి పెద్ద టెక్నాలజీ ఇంక్యుబేటర్‌ని నిర్మించామని చెప్పుకోవచ్చు. 2014లో రూ.57 వేల కోట్లుగా ఉన్న ఐటీ ఎగుమతుల విలువని 2023లో రూ.2.41 లక్షల కోట్లకు నేనే తీసుకువచ్చాను అని కూడా చెప్పుకోవచ్చు. టీఎస్ ఐ-పాస్, టీఎస్ బీ-పాస్ లాంటి విప్లవాత్మకమైన చట్టాలను తెచ్చి దేశ, విదేశాల ప్రశంసలు పొందాం అని చెప్పొచ్చు. అమెజాన్ లాంటి బహుళజాతి సంస్థ అతిపెద్ద డేటా సెంటర్‌ను హైదరాబాద్‌కు నేనే రప్పించానని చెప్పుకోవచ్చు. నా హయాంలోనే గూగుల్, ఫేస్‌బుక్, మెడిట్రాన్, సాఫ్సోల్, కవల్ కామ్, నోవార్టిస్ లాంటి సంస్థలు వాటి రెండో అతిపెద్ద కార్యాలయాలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేశాయని చెప్పుకోవచ్చు.

టీ-హబ్, టీ-వర్క్, టీ-ఇమేజ్ టవర్ ఆవిష్కరణలతో ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్నోవేషన్ క్యాంపస్ సృష్టించామని చెప్పుకోవచ్చు. నా మానస పుత్రిక అయిన ఎస్ఆర్‌డీపీ కార్యక్రమం ద్వారా హైదరాబాద్‌లో 30 నుంచి 40 ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, పదుల సంఖ్యలో లింక్ రోడ్లు నిర్మితమయ్యాయని చెప్పుకోవచ్చు. ఒక్కమాటలో సమస్త హైదరాబాద్ రూపురేఖలను నేనే మార్చేశానని కూడా చెప్పుకోవచ్చు.

నేను బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నప్పుడే 60 లక్షల సభ్యత్వ నమోదు జరిగిందని చెప్పుకోవచ్చు. 2016లో నా వల్లే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో 99 మంది కార్పొరేటర్లు గెలిచారని చెప్పుకోవచ్చు. 2018 సార్వత్రిక ఎన్నికల విజయంలో నాదే నంబర్ 2, నంబర్ 3 పాత్ర అని చెప్పుకోవచ్చు. సాధించిన విజయాల ప్రస్తావన ఎక్కడా లేదు. కానీ, ఇప్పుడు ఎదురైన ఓటమికి ఎమ్మెల్యేలనో, ఇతర నాయకులనో లేదా కార్యకర్తలనో బాధ్యులని చేయలేదు. ఈ వైఫల్యానికి పూర్తి బాధ్యత నాదే అని కేటీఆర్ అన్నారు. గెలిచినప్పుడు ఇది సమష్టి విజయం అని అన్నారు.. ఓడినప్పుడు పూర్తి బాధ్యత నాదే అని ఆయన అన్నారు.

గతంలో దుబ్బాక, హుజురాబాద్ ఉప ఎన్నికల్లో పార్టీ క్యాడర్ సర్వశక్తులు ఒడ్డినా, ప్రత్యేక పరిస్థితుల్లో ఎదురైన ఓటమికి పూర్తి బాధ్యత నాదేనని హరీశ్‌రావు కూడా ప్రకటించారు. మన నాయకుల లాగానే ఓటమికి బాధ్యత మనం కూడా తీసుకుందామా? పార్టీ బలోపేతానికి, తిరిగి అధికారంలోకి రావడానికి కృషి చేద్దామా? లేదా ఓటమికి కారణం మీరంటే మీరని ఒకరిపై ఒకరం దుమ్మెత్తి పోసుకుందామా?

ఇప్పటికీ తెలంగాణలో అత్యంత బలమైన పార్టీ మన బీఆర్ఎస్సే అనేది మనం గుర్తుంచుకోవాలి. ఎమ్మెల్యేల సంఖ్య మాత్రమే తగ్గింది. 65 శాతం ఎంపీలు, 80 శాతానికిపైగా ఎమ్మెల్సీలు, 128 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో 115కి పైగా చైర్మన్లు, మేయర్లు, 32 మంది జడ్పీ చైర్మన్లలో 30కి పైగా మనవాళ్లే ఉన్నారు. అత్యధిక స్థానాలలో కార్పొరేటర్లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, అన్నిటికన్నా ముఖ్యంగా లక్షలాది మంది గులాబీ కుటుంబ సభ్యులున్నారు.

ఈ స్థాయిలో అంకెలు సాధించాలంటే కాంగ్రెస్, బీజేపీలకు మరో 50 ఏండ్లైనా వీలుకాదు. కేసీఆర్ నాయకత్వంలో ఎన్నో విజయాలు సాధించాం. అన్నిటికన్నా చిరస్మరణీయమైన విజయం తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడం. సార్ నాయకత్వంలో భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధిస్తాం. ఇది మన పార్టీ, తెలంగాణ అస్తిత్వమే మనం.

**-జై తెలంగాణ.. జై కేసీఆర్**




పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని గత ప్రభుత్వ హయాంలోనే రూ.10 లక్షల వరకు ఉండేది. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం కూడా ఆరు గ్యారంటీల్లో భాగంగా పరిమితిని రూ.10 లక్షలకు పెంచుతామని చెప్పిన విషయం విదితమే. కానీ, ప్రస్తుతం ఆరోగ్యశ్రీ రోగులకు మందులు కరువయ్యాయి.

# ఆరోగ్యశ్రీపై పట్టింపేది?



**గుండమల్ల సతీష్ కుమార్**
94931 55522

పంజాగుట్టలోని నిమ్స్ దవాఖానలో ఉన్న ఆరోగ్యశ్రీ రోగుల పరిస్థితి అధ్వానంగా మారింది. కార్పొరేట్ వైద్యాన్ని పేద ప్రజలకు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు చెప్తుంటే.. మరోవైపు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్యం చేయించుకునే రోగులకు సమయానికి కావాల్సిన మందులు అందని పరిస్థితి నెలకొన్నది. ఆరోగ్యశ్రీ పథకంలో రోగులకు మెరుగైన వైద్యం అందడం లేదనేది స్పష్టమవుతున్నది. సంబంధిత వైద్యారోగ్య శాఖ ఉన్నత స్థాయి అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలి. పేద ప్రజలకు అందాల్సిన మెరుగైన వైద్యంలో నిర్లక్ష్యానికి కారణాలను సమీక్షించి సరిదిద్దాలి. నిమ్స్‌లో ఆరోగ్యశ్రీ పథకంలో కీమోథెరపీ చేయించుకునే రోగులకు అవసరమైన మందులు అందుబాటులో లేవు. వారం రోజులు వేచిచూసినా మందులు రాని పరిస్థితి ఏర్పడింది. అవసరమైన మందులను బయట నుంచి తెచ్చుకోవాలని వైద్యులు తేల్చి చెప్తున్నారు. అవసరమైన మందులు పంపించాలని ఉన్నతాధికారులకు నివేదించామని, సమయానికి ప్రభుత్వం అందించకపోతే తామేం చేయాలని వైద్య సిబ్బంది చేతులెత్తేస్తున్నారు.

రేడియేషన్ మిషన్ అయితే రెండు మూడు రోజులకు ఒకసారి రిపేర్‌కి వస్తది. కొత్త మిషన్ ఏర్పాటు చేసేందుకు నిధులు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. క్యాన్సర్ బాధితుల పరిస్థితిని అర్థం చేసుకొని అవసరమైన ఔషధాలను వెంటనే అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉన్నది. అందుబాటులో ఉన్నప్పటికీ వైద్య సిబ్బంది రోగులకు ఇవ్వడం లేదా అనేది వైద్యాధికారులు తేల్చాలి.

ఏ కార్పొరేట్ దవాఖానలో ఆరోగ్యశ్రీ పథకం వర్తిస్తుందో ప్రజలకు స్పష్టత ఉండటం లేదు. ఈ అంశంపై ప్రజలకు అధికారులు అవగాహన కల్పించాలి. ఉదాహరణకు యశోద, అపోలో ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచిత వైద్యం చేస్తారా? లేదా? ఒకవేళ ఆరోగ్యశ్రీ వర్తిస్తే ఎటువంటి రోగాలకు ఉచితంగా చికిత్స అందిస్తారనే విషయాలను తెలియపరచాలి. అదే విధంగా ఆరోగ్యశ్రీ పథకానికి సంబంధించి ఔషధాలను అందుబాటులో ఉంచాలి. లేదంటే డబ్బులు పెట్టి బయటి మందులు కొనలేని పేదల ప్రాణాలు పోయినట్టే. గతనెల రోజులుగా వింటున్న పదం ప్రజా పాలన. పాలకులం కాదు సేవకులం అని చెప్తున్న ప్రభుత్వ పెద్దలు సామాన్యుల సమస్యలను పరిష్కరిస్తారా? లేదా అనేది చూడాలి మరి.

# బాల్యంపై భారం మోపొద్దు



**ఎం. విజయ ప్రభాకర్**

నా 16 ఏండ్ల ఉపాధ్యాయ వృత్తి జీవితంలో తమ పిల్లలను పిల్లల్లాగా అంగీకరించిన తల్లిదండ్రులను చాలా అరుదుగా చూశాను. విద్యా సంస్థల నుంచి బయటికి వచ్చేటప్పుడు తమ పిల్లలు చెక్కిన శిల్పంలాగా ఉండాలని ప్రతిఒక్కరూ తాపత్రయ పడుతుంటారు. పిల్లల పట్ల వారు అభద్రతా భావంతో ఉంటారు. మన గుర్తింపుల కోసం పాకులాడే క్రమంలో ప్రత్యేకమైన వ్యక్తులకు మనం జన్మనిచ్చామనే విషయాన్ని మర్చిపోతుంటాం.



చిన్నారుల మోముల్లోని అమాయకత్వాన్ని చంపి, వారిని ఒత్తిడి కుండలుగా (ప్రెజర్ పాట్) మార్చి మనం నేరస్థులుగా మారుతున్నాం. మనకు జీవితఖైదు విధించినా.. వారి పాలబుగ్గల్లాంటి ముఖాల్లో పువ్వులాంటి తాజాదనాన్ని మళ్లీ తీసుకురాలేం. తమ పిల్లల భవిష్యత్తు గురించి ప్రతిఒక్కరూ ఆందోళన చెందడం సహజమే. పిల్లల భవిష్యత్తు పట్ల ఆందోళన పేరిట మనం వారిపై వయసుకు మించిన భారాన్ని వేస్తున్నాం. అయితే మంచి మార్కులే మంచి జీవితాన్ని ఇస్తుందని మనం భావిస్తుంటాం. కానీ, వారికి మంచి అవకాశాలు, భవిష్యత్తును ఆత్మవిశ్వాసమే ఇస్తుంది. పరీక్షల్లో మంచి మార్కులు సాధించడం కంటే వారి భద్రతే ముఖ్యం కదా.

పరీక్షల్లో మంచి మార్కులు సాధించే పిల్లలతో తమ పిల్లల్ని పోల్చే తల్లిదండ్రులను తరచూ చూస్తునే ఉంటాం. వారిపై సిలబస్‌ను రుద్దే ప్రయత్నంలో వారిలో ఉండే సృజనాత్మకతను దూరం చేస్తున్నాం. విద్య అనేది చిన్నారులకు అందించే నీరు లాంటిది. మనం దానిలో వేలు పెడితే అది చెడిపోతుంది. పోటీ మంచిది కాదని నేను చెప్పడం లేదు. ఇతరులతో పోటీ చేయవద్దని అసలే చెప్పను. కానీ, పిల్లల వయసుకు మించి భారాన్ని మాత్రం వారిపై వేయవద్దు. వయసుకు మించిన భారాన్ని మోయాలని మాత్రం వారిని ప్రేరేపించకండి. మీరూ ఆశించకండి.

తరగతి గదులను పిల్లలకు గుర్తింపునిచ్చే మచ్చలేని పూల తోటలుగానే ఉండనివ్వండి. పాస్ లేదా ఫెయిల్ అనే అంశాలను చిన్నారుల మెదళ్లలోకి ఎక్కించకండి. బాల్యం అనేది ప్రెజర్‌కుక్కర్‌లో ఉడికే గింజలా కాకుండా వేడుకలా ఉండనివ్వండి. 'చిన్నారులకు ఆహ్లాదకరమైన, సంతోషకరమైన జీవితాన్ని ఇస్తాం' అని మనందరం ఈ కొత్త సంవత్సరంలో ప్రతిజ్ఞ చేద్దాం.




## పీవోకే ఎప్పటికీ భారత్‌దే



కేంద్రపాలిత ప్రాంతాలు జమ్మూ కశ్మీర్, లద్దాఖ్ భారత్‌లో అంతర్భాగం. అవి ఎప్పటికీ సార్వభౌమాధికార భారత్‌లో భాగంగానే ఉంటాయి. పాకిస్థాన్‌లో యూకే హైకమిషనర్ జేన్ మారియట్ భారత్‌లో భాగమైన పీవోకేలో పర్యటించడం అత్యంత అభ్యంతరకరం. అది భారత సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతకు భంగం కలిగించే చర్య.

**- జైశంకర్,** విదేశాంగ శాఖ మంత్రి